# శ్రమ

**కప్పగంతుల మల్లికార్జునరావు**

**ఎంత** కష్టపడితేనేం? రెండురోజులు ఆఫీసుకు సెలవు పెట్టాల్సి వస్తే మాత్రమేం? చివరికి అనుకున్నది సాధించాను. రసాయన శాస్త్రంలో నాలుగేళ్ళు పరిశోధన చేసి ఒక కొత్త విషయాన్ని కనిపెట్టినప్పుడు కూడా ఇంత గర్వాన్ని పొందేనో, లేదో గుర్తు లేదు.

క్యూలో నుంచి బయటపడి చేతులో నున్న వస్తువుల్ని చూచుకొన్నాను. వాటిని పొందగలిగిన నేను ఎంత అదృష్టవంతుడిని? వైజ్ఞానిక శాస్త్రరంగంలో నా కృషిని గురించి ప్రభుత్వం వారిచ్చిన బహుమతిని భారత రాష్ట్రపతి చేతుల్లోంచి తీసుకొన్న క్షణంలో కూడా ఇంత ఆనందాన్ని పొందిన గుర్తు లేదు.

ఈ శుభవార్తను స్వయంగా సులోచనకు చెప్తే కాని నాకు తృప్తి ఉండదు. ఆటో వేసుకొని మరీ ఇల్లు చేరుకొన్నాను.

సులోచనను చూడగానే ఆనంద పరవశంలో సినిమాలో లాగా ఆమె నడుం చుట్టూ చెయ్యివేసి గిర్రున తిప్పుతూ ఎగరాలనే చిలిపికోరిక కలిగింది. అలా చేస్తూ "మనకు రిజర్వేషన్ చిక్కిందోచ్. మనం అనుకొన్న రోజుకే, అనుకొన్న బండికే, ఖచ్చితంగా రైల్వే వాళ్ళు నిర్దేశించిన రేటుకే మనకు నాలుగుటిక్కెట్లు రిజర్వు అయినాయి సులోచనా డార్లింగ్" అన్నాను ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయిపోతూ.

కానీ నేను ఆశించినట్లు నాతో పాటు ఆనందసాగరంలో ఈదటానికి ఉత్సుకత చూపలేదు. కాగా నా గుండెకి గురి చూసి మెషిన్‌గన్ షాట్‌లా ఒక ప్రశ్న వేసింది.

"మీ ప్రయోజకత్వానికి సంతోషించాంలే కాని, రిజర్వు చేయించింది ఫస్ట్‌క్లాసా, సెకండ్‌క్లాసా?"

టియర్ గాస్ షెల్స్‌ను ఎదుర్కొన్నప్పటి స్థితి అయింది నాకు.

"ఒక్కసారి అందరం కల్సి మన వూరికి సర్దాగా వెళ్ళివద్దామండీ." రెండో పిల్ల పుట్టిన దగ్గరి నుంచి సులోచన ఆ కోరిక కోరుతూనే ఉంది. నాకూ ఆ కోరిక లేకపోలేదు కానీ...?

నేను చేస్తున్నది ఢిల్లీలో నా సైంటిస్టు ఉద్యోగం. మేధావిగా నాకు చిన్నప్పటి నుంచి కాస్తో కూస్తో పేరుంది. ఆ పేరును వయసుతో పాటు పెంచుకొంటూ నే వస్తున్నాను. నా పరిశోధనలకు అంతర్జాతీయ గుర్తింపు వచ్చింది. నేను దేశంలో ఎన్నో సెమినార్లలో పాల్గొన్నాను. ఉపన్యాసాలిచ్చాను. వ్యాసాలు రాసేను. నా బొమ్మలు, నాతో చేసిన ఇంటర్వ్యూలు అనేక పత్రికల్లో పడ్డాయి.

అయినా ఇవేవీ సులోచనకు తృప్తిని సంతోషాన్ని ఇవ్వలేదు. ఆమెకు ఫ్రిజ్‌లు కావాలి. కారు కావాలి. కాలనీలో ఫ్లాట్స్ కొనాలి. తనకి, పిల్లకి నగలు దిగేయాలి.

నాకు జీతం బాగానే వస్తుంది. కానీ, అంతకు తగ్గ ఖర్చులూ ఉన్నాయి.

అప్పటికీ అప్పులు చేసి నా శక్తి మేర ఆధునిక సౌకర్యాలు ఇంట్లో అమరుస్తూనే ఉన్నాను.

సులోచన వస్తుతః మంచిదే. కాకపోతే కాస్త ఆడంబరాలు, దర్జాలు కావాలి. అది ఆమె స్నేహ ప్రభావం అని నా అభిప్రాయం!

సులోచన ఎక్స్‌ట్రావర్ట్. క్షణంలో స్నేహాలు చేస్తుంది. ఎటువంటి వారితోనైనా ఇట్టే కలిసిపోతుంది.

ఢిల్లీలో ఉండటం వల అంతస్తుల తారతమ్యాలను అంతగా పాటించే ధోరణి తక్కువ. అందులోనూ ఆంధ్రులంతా అలాంటి పట్టింపులు లేకుండా కలిసికట్టుగా ఉంటారు.

గుమాస్తాల భార్యల దగ్గరి నుంచి, ఆఫీసర్ల భార్యల దాకా ఆమెకు ఆంధ్రుల్లోనే కాకుండా పంజాబీలు, గుజరాతీలు, బెంగాలీలు ఎందరో స్నేహితురాండ్రు ఉన్నారు. వారిళ్ళకు రాకపోకలు హెచ్చు. వాళ్ళ కబుర్లు నా దగ్గర చెప్తుంటుంది.


"మిహర్‌సింగ్‌గారు వారి శ్రీమతిగారి పేరిట వాళ్ళ వూళ్ళో ఒక పెద్ద ఇల్లు కొన్నారట! ఆయన సెంట్రల్ సెక్రటేరియెట్‌లో ఒక చిన్న ఆఫీసర్. ఈ పదేళ్ళలో ఆయన కొంటున్న మూడో ఇల్లు ఇది! తెల్సా?"

"మిసెస్ అజిత్ భట్టాచార్యకు వాళ్ళాయన నెక్లెస్ చేయించారు. ఇవాళ నాకు ఆవిడ చూపించింది. ఎంత బాగుందనుకొన్నారు? దాదాపు పాతిక వేలన్నా చేస్తుంది. నా అనుమానం ఏమంటే దాన్ని భట్టాచార్యగారు ఎవరి దగ్గరో ప్రెజెంట్‌గా లాగి ఉంటారు. లేకపోతే నెక్లెస్ సంగతి ఎవరికీ చెప్పవద్దని మిసెస్ భట్టాచార్య నాకు మరీ మరీ ఎందుకు చెప్తుంది?"

ఇలాగే మరెన్నో —

నాకు ఇలాంటి విషయాలంటే స్వభావసిద్ధంగానే ఇంటరెస్ట్ లేదు. నా పనేమిటో నే నేమిటో? నేను సీరియస్ టైప్ అనీ, ఇన్ ట్రావర్ట్ ననీ అంతా అంటారు.' మేధావిలా పెద్ద పోజోయ్' అని అనే వాళ్ళు కూడా లేకపోలేదు.

"మీ కెంత చదువు తెలివితేటలున్నా



ఎవరు ఆదుకొంటారు చెప్పండి? ఈ వయసులో ముందు జాగ్రత్త పడకపోతే ఎలా?''

''ఏం జాగ్రత్త పడమంటావు?''

''మనం మాత్రం ఇళ్ళు, బంగారం ఎందుకు కొనుక్కో కూడదు? సుఖంగా ఎందుకు బ్రతక కూడదు?''

''మనకి ఇప్పుడేం తక్కువ? హాయి గానే ఉన్నాంగా? ఇళ్ళు, బంగారం కొను క్కొంటే ఎవరు వద్దంటారు కానీ, డబ్బు కావాలిగా?''

''అదే నండీ—ఆ డబ్బే మీరు సంపా దించాలి.''

''సంపాదిస్తూనే ఉన్నానుగా? జీతం?''

''ఖర్మ! ఆ సంపాదన కాదండీ. మిహిర్‌సింగ్ గారికి, అజిత్ భట్టాచార్య గారికి మీ కన్నా జీతం తక్కువకదా? వారు ఇళ్ళు, నగలు కొంటున్నారే. ఆ సంపాదన...''

లంచగొండి తనం, అవినీతి, నమూ జంలోపరిపాలనా యంత్రాంగంలో ఉన్నా యని తెలీనంత వెర్రివాడిని కాను నేను. కానీ ఉన్నదాన్ని గోరంతలు కొండంతలు చేసి పదే పదే చెప్పుకుంటే ఏమవు తుంది? నీతిమంతుల మనసులుకూడా కల్మషం కావూ? నేను అలా ఎప్పుడూ ఆలోచించను.

''మిహిర్ సింగ్, అజిత్‌భట్టాచర్యలు అవినీతి మార్గంలో సంపాదించారనే ఎందుకనుకోవాలి? వారికి పిత్రార్జిత మైన ఆస్తులు ఉండవచ్చుగా?''

''నా బొంద ఆస్తులున్నాయ్. మీ రెప్పుడూ ఇంతే. బ్రతకటం చేతకాని వారు. మమ్మల్నేం సుఖపెడతారు?''

• • •

మా ఇన్‌స్టిట్యూట్‌లో లేబొరేటరీకి అంకితమైన ఉద్యోగం కనుక మాకు టూర్‌లు ఉండవు. ఒక వేళ అఫీషి యల్‌గా టూర్‌కు వెళితే మాత్రం ప్రభుత్వ ఖర్చు మీద నేను విమా నంలో కాని, ఫస్ట్ క్లాస్ ఏసిలో కాని ప్రయాణం చేయువచ్చును. అలా నేను కొన్నిసార్లు ప్రయాణం చేశాను.

కానీ ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడో నెల్లూరు దగ్గర ఉన్న మా వూరికి అఫీషియల్‌గా వెళ్ళేఅవకాశం నాకురాదు. మా ఆవిడకు కుటుంబ సమేతంగా ఫస్ట్ క్లాస్ ఏ సిలో మా వూరికి ప్రయాణం చేయాలని కోరిక ఎన్నాళ్ళుగానో ఉంది. ఢిల్లీలో చిన్న ఉద్యోగాలు చేస్తున్నవారు ఏదో మిష మీద టూర్స్ వేసుకుని భార్యా పిల్లలతో ఫస్ట్ క్లాస్‌లలో దర్జాగా వెళ్తుండటం చూసి ఆ కోరికను పెంచుకొని ఉంటుంది.

నేను ఇంటి పక్షిని. పుస్తకాల భక్తుడిని. నాకు ప్రయాణాలంటే చిరాకు. కాగా ఢిల్లీ నుంచి నెల్లూరు దాకా వెళ్ళాలంటే రైలుచార్జీలు కాస్తాకూస్తా అవుతాయా? అంత ఖర్చు పెట్టుకుని వెళ్ళి అక్కడ చేసేదేముంది?

''ఎవరూ లేకేం? మీ వాళ్ళు మా వాళ్ళు ఏమయ్యారు? వాళ్ళ సంగతి అలా ఉంచండి. నేను తిరుపతికి వస్తానని స్వామికి మొక్కుకున్నాను'' అంటూ ప్రయాణానికి నన్ను అంగీకరింపజేయ గలిగింది సులోచన.

''జన్మ కోసారి. ప్రతి రోజూ వెళ తామా? ఫస్ట్‌క్లాస్‌లో ఏసిలో దర్జాగా వెళ్ళక మీ కీ పిసినిగొట్టు ఆలోచన లేమిటి? మనకన్నా చిన్న ఉద్యోగాల వాళ్ళు హెచ్చు తరగతుల్లో ప్రయాణం చేస్తుంటే మనం సెకండ్ క్లాసులో ప్రయాణం చేయుటం నాకు తలకొట్టేసి నట్టుంటుంది, బాబూ! పైగా మనం సెకండ్ క్లాస్‌లోనుంచి దిగుతే మనల్ని రిసీవ్ చేసుకోటాని కొచ్చిన వాళ్ళు ఏమనుకుంటారో తెల్సా? పేరు గొప్ప వూరు దిబ్బలా ఉంటుంది మన కథ.''

'సెకండ్ క్లాస్ అయినా రిజర్వ్ చేయించుకొంటే ప్రయాణం హాయిగా ఉంటుంది. ఇంచక్కా పదిమందితో మాటాడుకోవచ్చు. తెల్సా?''

''మీ ఆలోచన అఘోరించినట్లు ఉంది. సెకండ్ క్లాస్ రిజర్వేషన్ ఎంత కష్టమో, ఒక వేళ రిజర్వేషన్‌చిక్కినా ఆ ప్రయాణంలో ఎన్ని చిక్కు లున్నాయో మీకేం తెల్సు! ఎప్పుడయినా ప్రయాణం చేస్తేగా?''

''నువ్వు ఎప్పుడు చేశావ్?''

''చేయకపోతేనేం? నాకు ఫ్రెండ్స్‌తో కాంటేక్ట్స్ జాస్తిగా! నాకు అన్నీతెల్సు.''

''సరేలే.దేనికి రిజర్వేషన్ దొరికితే దానికి తీసుకొస్తాగా? గొడవపెట్టకు.''

• • •

'సెకండ్‌క్లాస్ టిక్కెట్లే తెచ్చారు కదూ?'' నన్ను తినేశాలా చూస్తూ మరోసారి ఆ ప్రశ్నను షూట్ చేసింది.

ఫస్ట్‌క్లాస్ ఏసీ కానీ, ఫస్ట్‌క్లాస్ కాని దొరక లేదు. అందుకని సెకండ్ క్లాస్ త్రీ టైర్‌లో రిజర్వు చేయించు కొచ్చాను. అవి దొరకటం మాత్రం ఎంత కష్టమైందో తెల్సా? అంటూ అబద్ధాలని అందంగా ఆడవచ్చు. కానీ, నాకు అలా చెప్పాలని బుద్ధిపుట్టలేదు.

నేను అసలు ఫస్ట్ క్లాస్ సంగతే అనుకోలేదు. సెకండ్ క్లాస్ త్రీటైర్ బెర్తులు చిక్కినందుకేనా సంతోషమంతా! అవే దొరక్కపోతే ఫస్ట్ క్లాస్‌కోసం ఇబ్బడికి ముబ్బడి డబ్బు తగలెయ్యాలి


# ఓఓబి బ్లూ డిటర్జెంట్ పౌడరు చాలా తక్కువ ఖర్చుతో మీ బట్టలకొక ప్రత్యేక చలవ ఇవ్వడానికి-

ఓ ఓ బి బ్లూ డిటర్జెంటు వాషింగు పౌడరు నురుగులో తెల్లదనం ఇచ్చే ఓ ప్రత్యేక పదార్థమున్నది. తళతళలాడే మీ బట్టల తెల్లదనానికి, లాండ్రీ వుతుకులాంటి కొత్తదనానికి, మరియు మీ బట్టల సురక్షితానికి, ఈ ప్రత్యేక పదార్థమే కారణము.—

ఆల్ట్రా మెరైన్ అండ్ పిగ్‌మెంట్సు లిమిటెడ్
రాణిపేట,
తమిళనాడు




కేవలము బట్టకి నాలుగు పైసలే!

ఓఓబి బ్లూ డిటర్జెంట్ పౌడరు

Sista's-UPL-82 A 81.Tel

గదా? ఎంత అదా?

"నాకు తెలుసు. మీరు ఫస్ట్‌క్లాస్ టిక్కెట్లు అసలు అడిగే ఉండరు. మీరు మరీ ఇంత పిసినిగొట్టువా రనుకో లేదండి. మీకు సంపాదించటమే కాదు— సుఖపెట్టటమూ చాతకాదు."

నిజం! కానీ, సులోచన దృష్టిలో అతి తిట్టు. నా దృష్టిలో పొగడ్త!

● ● ●

సాయంకాలమే భోజనం చేసి న్యూఢిల్లీ స్టేషన్ల కొచ్చి రైలెక్కాం.

త్రీటైర్ కంపార్ట్‌మెంట్ అయినా మాది సైడ్ బెర్త్, లోయర్‌బెర్త్‌లు కావటంతో పిల్లలు ఆనందంగా ఉన్నారు. కిటికీ దగ్గర సీట్లలో చేరి ప్లాట్‌ఫామ్ మీది రణగొణను చూస్తూ హుషారుగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

సులోచనమాత్రం మూతి ముడుచుకొని ప్లాట్‌ఫామ్ మీది జనానికి కనిపించనట్లు పెట్టెలో అటునైపు కిటికీ దగ్గర కూర్చుంది. కారణం నేను వూహించాను. తను సెకండ్ క్లాస్‌లో ఉండగా ఎవరన్నా స్నేహితులు చూస్తే ఎంత నామోషి!

రెండు రాత్రిళ్ళు, ఓ పగలు ప్రయాణం. దారిలో తినటానికి జంతికలు, పులిహోర, ఇత్యాది తినుబండారాలు చేయమన్నాను సులోచనను. దాని కేమంది—

"పెద్ద ఇంటర్ నేషనల్ సైంటిస్టు అని పేరు..పులిహోర, దద్ధోజనం, జంతికలు—బఠానీ బుడ్డలు — ఒట్టి సెకండ్ క్లాస్ బుద్ధులు. మా అమ్మమ్మగారిలా పులిహోరలు, దద్ధోజనాలు నేను మూటలు కట్టుకో లేను. రైల్లో మీకేం కావాలంటే అవి కొనిపెట్టాలెండి. లెస్ లగేజ్ మోర్ కంఫర్ట్"

ఏం కావలంటే అవి కొనుక్కోవచ్చు కానీ, ఖర్చు సంగతి?

"డాడీ ..."

బేబీ పిలుపులో ఉన్న అభ్యర్థన అర్థం నాకు తెల్సు.

కోరికల కంధిరీగల బుట్టే రైలు కదలక ముందే కదిలింది.

సులోచనను ప్రసన్నం చేసుకోవటానికి ధారాళంగా, దర్జాగా ఖర్చుచేయటంకన్నా మించిన మార్గ మేముంది?

● ● ●

ఆ రాత్రి ప్రయాణం బాగానే జరిగింది. పది గంటల కల్లా ఎవరి దోవన వారు నిద్రలకు ఉపక్రమించటం వల్ల ఖర్చూ కలిసి వచ్చింది.

తెలతెలవారుతూండగా నన్ను ఎవరో తట్టి లేపినట్లయితే లేచాను. సులోచన! ఆమె మొహంలో విసుగు. ఆమె దృష్టి ననుసరించి నా దృష్టి రైలు పెట్టె నో సారి కలియచూసింది.

అంగుళం ఖాళీ లేదు పెట్టెలో. ఎక్కడపడితే అక్కడ జనం పడుకుని ఉన్నారు. జనరల్ కంపార్ట్‌మెంటులా ఉంది కాని, రిజర్వుడు కంపార్ట్‌మెంటులా లేదు.

ఆమెను మెల్లగా బాత్ రూమ్ దాకా మనుషుల మీద నుంచి దాటించి తీసుకెళ్ళాను. ఈలోగా ఏదో స్టేషనువచ్చింది. శవాల్లా నేల మీద పడుకుని ఉన్న జనం లేచి బిలబిలమంటూ దిగిపోయారు.

చాయ్ వాలాల కేకలు! పగటి పూట ప్రయాణంలోకి ప్రవేశించాము.

ఎక్కడినుంచి వచ్చారో, ఎలావచ్చారో తెలియదు—అదుపు అజ్ఞ లేనట్లు జనం మా పెట్టెలోకి ఎక్కారు. 'సర్దుకోండి' 'సర్దుకోండి' అంటూ ఒక్కో సీటుకు ఇద్దరు చొప్పున క్రిక్కిరిసి కూర్చున్నారు. వీరుగాక స్టేండింగ్ పేసెంజర్స్! వీరిని తోసుకుంటూ, సందు చేసుకొంటూ, అరుస్తూ అమ్మకాలు సాగించే వారు. పోట్లాటలు... బిచ్చగాళ్ళ అరుపులు ... ఏలం పాటలు ...

మా కుటుంబాన్ని ఓ మూలకి నెట్టేశారు జనం. ఒదిగి ఒదిగి కూర్చున్నాము. మా సామాను ఎవరి పాదాల క్రింద నలిగిపోతున్నాయో చూసుకొనే ఓపిక లేదు మాకు.

నేను సిగ్గుతో సులోచన మొహంలోకి చూచాను. రిజర్వుడు కంపార్ట్‌మెంటులో ప్రయాణం మరీ ఇంత హీనంగా ఉంటుందని నేను వూహించ లేదు.

"సెకండ్ క్లాస్ ప్రయాణం సంబడం చూచారుగా! మీకు తెలియదు. నేను చెప్తే వినలేదు."

—సులోచన ఆ మాటల్ని అనలేదు కాని, ఆమె ప్రతి చూపు, ప్రతి చర్యలో ఆ అర్థాలు నాకు ధ్వనించాయి. అసలు ఆమె మౌనంలోనే ఎన్నెన్నో భావాలు!

అదేదో స్టేషన్‌లో కాస్త రద్దీ తగ్గింది. రైల్లోకి భోజనా లొచ్చాయి. తిన్నా మనిపించాము. సాయంకాలం పూట రద్దీ లేకుండానే గడిచింది.

రాత్రి భోజనం ఆంధ్రప్రదేశ్ లోని ఓ స్టేషన్లో చేశాము. పక్కలు పరిచాము బెర్త్‌ల మీద. పగలంతా రద్దీలో హైరాన పడ్డారేమో పిల్లలు పడుకోగానే నిద్ర పోయారు.

"తెల్లవారితే మన వూళ్ళో ఉంటాం. సారీ, సులోచనా! ప్రయాణంలో సర్దా లేకుండా చేశాను కదూ?"

"ఊఁ." ఆమె అటు తిరిగి పడుకుంది.

ఎవరో లైట్ స్విచ్ ఆఫ్ చేశారు. నైట్ లాంప్ మాత్రమే పేలంగా వెలుగుతోంది.

● ● ●

నాకు ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టటం లేదు. రిజర్వుడు కంపార్ట్‌మెంట్‌లోకి అంతంత మంది జనం ఎలా ఎక్కగలుగు తున్నారు? కండక్టర్ ఏం చేస్తున్నాడు?

రైలు ఏదో స్టేషనులో ఆగింది. టైమ్ చూచుకొన్నా—పది గంటలు కావస్తూంది.

జనం బిలబిల మంటూ ఎక్కారు కంపార్ట్‌మెంట్‌లోకి. ఎవరో బేబీ పడుకొన్న బెర్త్ మీద మిగిలిన స్థలంలో పాత సామాను పడేశాడు. మరొకడు బాబు పడుకున్న బెర్త్ మీద టేఖాడా వేశాడు.

"ఏమిటీ దవుర్జన్యం? ఇవి మా రిజర్వుడు బెర్త్‌లు."

'అవుననుకోండి. కానీ రాత్రి ప్రయాణం సర్దుకొక పోతే ఎలా—మనం మనం? ప్లీజ్ విజయవాడ వరకే."

"టీసీ పర్మిషన్ తీసుకొనే లోపలికొచ్చారా?"

"ఆ టీసీ చేసేదేముంది లెండి? మేం మేనేజ్ చేసుకొంటాంగా?"

ఏమనగలను?

ఈ లోగా రైలు కదిలింది. స్టాండింగ్ పాసెంజర్స్‌తో పెట్టె నిండిపోయింది. వాళ్ళ మధ్య నల్లకోటుతో టీసీ!

పాసెంజర్స్ టీసీని ఎలా మేనేజ్ చేస్తారో తెల్సుకోటానికి నాకు ఎంతో టైమ్ పట్టలేదు. పాసెంజర్స్ దగ్గర డబ్బు టీసీ జేబులోకి చేరుతోం దంతే!

విజయవాడ దాకా ఎడ్జెస్ట్ కావాలి సుమా! అక్కడి పొజిషన్‌ను బట్టి బెర్త్ అలాట్ చేస్తాను." విజయవాడ పైకి వెళ్ళవాల్సిన వారితో చెప్తున్న డైలాగ్.

"విజయవాడదాకేగా. మీరు రిజర్వేషన్ వున్న పాసెంజర్స్‌ను డిస్టర్బ్ చేయకుండా ఎడ్జస్ట్ అయిపోండి!"

ఏ ఒక్కరికి రిసీట్ ఇవ్వటం లేదు. కాగా టిక్కెట్ల నెంబర్లను ఓ తెల్ల కాగితం మీద రాసుకొంటున్నాడు— ఎందుకో?

సులోచన కోరుకొనే సంపాదన అదే కామోసు!

నేను సులోచన వైపు చూచాను. ఉలిక్కి పడ్డాను!

ఆమె చిత్రంగా నవ్వింది. చూడండి... చూడండి" అంటూ ఆమె సర్దుకుని పడుకుంది.

● ● ●

నా గుండె మండుతూంది. ఆలోచించే కొద్దీ ఆ మంట పెరిగింది.

బెర్త్ మీది నుంచి క్రిందికి దిగి జనాన్ని తోసుకుంటూ టీసీ సీటు వద్ద కెళ్ళాను. అత నప్పటికే తన పని ముగించుకొని విశ్రాంతిగా కూర్చుని సిగరెట్టు తాగుతున్నాడు.

"మిస్టర్ టీసీ! ఈ పాసెంజర్స్ అంతా ఎవరు? ఇది రిజర్వేషన్ కంపార్ట్‌మెంటా లేక జనరలా? నేను మీరు చేసిందంతా చూశాను ... దటీజ్ టూ మచ్. నెక్స్ట్ స్టేషన్‌లో పాసెంజర్స్‌ని దించుతారా లేక. .."

"సారీసర్! అలాగే దించుతాను.కానీ" అంటూ ఆగి అనుమానంగా నావైపు చూచాడు. పక్కనున్న స్విచ్ నొక్కి లైట్ వెలిగించాడు.

"మీరు—సారీ. . . నువ్వు రావ్‌వి కదూ?"

అప్పుడు అతని మొహం చూశాను. ఎక్కడో చూచిన గుర్తు!

ఒరేయ్! నన్ను గుర్తు పట్టలేదురా— నేను చలపతివిరా"

చలపతి, నేను చిన్ననాటి స్నేహితులం. వాడికి చదువు మీద కన్నా ఆటలు, కొట్లాటల మీద శ్రద్ధ ఎక్కువగా ఉండేది. వాడంటే మాస్టర్లకి హడల్. మాస్టర్లని బెదిరించి కాపీలు కొట్టి మెల్లగా మూడోసారికి యస్సెల్సీ ముక్కించాడు. ఆటల్లో ప్రతిభవల్ల తనకి రైల్వేలో టీసీ ఉద్యోగం దొరికిందని అప్పట్లో చెప్పాడు. నేను ఉద్యోగంలో చేరక ముందు ఒకటి రెండు సార్లు కలిశాము. అంతే ఆ తర్వాత ఇన్నాళ్ళకు!

చలపతి నాకు అవకాశం ఇవ్వకుండా చిన్ననాటి కబుర్లు బోలెడన్ని చెప్పాడు. నన్ను గురించి అడిగి తెలుసుకొన్నాడు. నా తెలివి తేటల్ని ప్రతిభను పొగిడాడు. నా భార్యా పిల్లలతో ప్రయాణం చేస్తున్నానని తెల్సి మా బెర్త్‌ల దగ్గరికొచ్చి వదిన అంటూ సులోచనతో ఏమేమో కబుర్లు చెప్పాడు.

"వదినా! మిమ్మల్ని నే నో కోరిక కోరబోతున్నా—కాదన కూడదు."

విజయవాడలో జర్నీని బ్రేక్‌చేసి రెండు రోజులు తన ఆతిథ్యం తీసుకోమన్నది ఆ కోరిక.

నాకు ప్రోగ్రాంలో ఛేంజ్‌లు ఇష్టం లేదు. కనుక నేను నిరాకరించాను. అయితే చిత్రం! అతనితో పది నిము

షల క్రితం పరిచయమయిన సులోచన అతని అభ్యర్థనను అంగీకరించింది.

"మీ చిన్ననాటి స్నేహితుడి ఉద్యోగ జీవితం చూశారుగా? గృహ జీవితం కూడా చూస్తే బాగుంటుం'దనీ అంటూ మరోసారి చిత్రంగా నవ్వింది. ఆడవారి మాటలకే కాదు—చేతలకూ అర్థాలు వేరేగదా?

"ఇదే మా ఇల్లు."

రిక్షాదిగి ఇల్లు చూచి ఆశ్చర్యపోయాను.

చలపతి స్వతః ఆస్తి పాస్తులున్న వాడు కాదు. చాలా బీదవాడు. మరి అంత పెద్ద బిల్డింగ్ కట్టాడూ అంటే...?

బిల్డింగ్ లోపల కూడా చాలా అప్ టు డేట్‌గా అన్ని సౌకర్యాలతో నీట్‌గా, కాన్ష్టలీగా వుంది. చలపతి క్రింది పోర్షన్ను మూడు అద్దెకిచ్చి, మేడపైన తను కాపురం ఉంటున్నాడు.

ఇంట్లో ఫ్రిజ్, మిక్సీ, టూ యిన్ వన్, సోఫాలు, పింగాణీ సామాన్లు ఇత్యాది నీట్‌గా అమర్చబడి వాటి వాటి స్థానల్లో ఉన్నాయి.

"ఇదంతా నా ప్రయోజనత్వం అనుకొంటున్నారేమో! నాకు సగం జీవితం రైల్లో, మిగతా సగంలో ముప్పాతిక భాగం నిద్రలోనూ గడిచిపోతుంది. మిగతా పావు భాగం మాత్రే నాది ఇంట్లో. ఇదంతా మా ఆవిడ మాధురి ప్రయోజకత్వం."

సులోచన, మాధురి క్షణంలో స్నేహితులయ్యారు. కబుర్లకు కరువా? ఇద్దరూ ఎక్స్ట్రా వర్టలే!

"చలపతీ! ఇదంతా రాత్రి రైల్లో సంపాదించినట్లు సంపాదించినదేనా?" నా కంఠంలో అసూయ ధ్వనించినట్లు నాకు తెలుసు.

"నా మొహం. ఇదంతా మా ఆవిడ ఆస్తి. ఆమె చిన్న సైజు డైరీ ఫారం నడుపుతోంది తెల్సా? అదుగో అటు చూడు!"

చూశాను. దొడ్లో కొన్ని గేదెలు ఒక షెడ్‌లో కట్టేసి ఉన్నాయి.

"ఉద్యోగాల్లో ఎంత సంపాదించినా గొర్రెకు బెత్తెడే తోక భాయ్! పైగా నే నేమన్నా నీలాగా పెద్ద ఆఫీసర్‌నా? టీసీ ఉద్యోగిని. ఇదంతా మా ఆవిడ ఆస్తి. ఆమెకు బిజినెస్‌లో కల్సి సంపాదించింది. తెల్సా?"

నాకు నమ్మబుద్ధి వేయలేదు. పైగా ఎంత వద్దనుకొన్నా, నా జీవితాన్ని అతని జీవితంతో పోల్చుకొని బాధపడసాగాను.

రీసెర్చ్ చేసిన సైంటిస్టును నేను. యస్సెల్సీ పాసైన అతని ఉద్యోగం రైళ్లో ప్రయాణికుల రిజర్వేషలను చూడటం, ఇవ్వటం. మా ఇద్దరి జీవిత స్థాయిలలో ఎంత తేడా? మేధావికి వున్న విలువ ఇదా?

నేనూ ఆ రైల్వే ఉద్యోగం లాంటి దానిలో చేరిపోతే ఎంత బాగుండేది? ఈ చదువులు, రీసెర్చిలు.. నిత్య పరిశోధనలు...ఓ!

ఎక్కడుందీ విపరీత విపర్యయం? ఈ స్థితి ఏర్పడ్డానికి కారణం—సామాజిక వ్యవస్థలో లోపమా? వ్యక్తుల లోపమా? లేక రెండూ పరస్పర ఆశ్రయాలా?

"ఏమిటి ఆలోచిస్తున్నారు? మీ స్నేహితుడి జీవిత శైలినేనా? మాధురి స్వయంగా గొప్పగా చెప్పుకొన్న విషయాలు మరి కొన్ని చెప్పేదా? మీ స్నేహితుడికి సంపాదించే కళ ఎంత బాగా తెలుసో, పైవాళ్ళకు ఖర్చు పెట్టే కళలో గూడా అంత ప్రజ్ఞ వుంది. రైలెక్కితే వెయ్యికి తక్కువగా ఇంటికి తిరిగి రానని ప్రమాణం చేశాట్ట! మాధురి పాలు, పెరుగు వ్యాపారం—బ్లాక్‌మనీని వైట్ చేసుకోటానికి మీ స్నేహితుడు చేతిలో సాధనంట! మీరు మేధావులో, మీ మిత్రుడు మేధావో మనం ఢిల్లీ పోయే వాకా ఆలోచించండి."

"దొంగలు, రవుడీలు, జేబు దొంగలు జూదగాళ్ళు, ముష్టి వాళ్ల లాగా చలపతులూ, మిహర్ సింగ్‌లు, అజిత్ భట్టాచార్యలూ కూడా సమాజ ప్రవాహం మీద తేలిన మురికి తెట్టలే! వారి వల్ల సమాజం కల్మషమయ్యే మాట వాస్తవమే కానీ, ఈ కల్మషాన్ని ప్రయత్నం మీద స్థిర నిర్ణయం ఉంటే తొలగించుకోవచ్చు. కానీ అలాంటి వాళ్ళను చూచి నాలాంటి వాళ్ళు అసూయపడ్తే, వాళ్ళే నిజమైన మేధావులు అన్న భ్రమలో పడ్తే, వారిని అనుకరించబోతే అప్పుడు అసలైన ట్రాజెడీ ఆరంభ మవుతుంది. జాతి జీవనం విషాద భరిత మవుతుంది. నేను చలపతిని చూసి అసూయ పడను, సులోచనా! అతడిని అనుకరించే ప్రయత్నం చేయను.

ఎందుకంటే మన జీవితాన్ని తల్చుకొని నేను ఇప్పుడు గర్విస్తున్నాను. నాకు నిజమైన సహ ధర్మచారిణివై సహకరించవూ? ప్లీజ్..."

భర్త కంఠస్వరంలోని నిజాయితీని, నిశ్చయాన్ని చూచి సులోచన భయపడింది.

అతని కళ్ళల్లోని నీళ్ళను చూచి ఆమె కరిగి పోయింది.

"అలాగేనండీ! కాని నన్ను క్షమించవరూ?" భయాజనిత కల్మషం క్షాళనమయి పోగా స్వచ్ఛంగా నిర్మలంగా అంది సులోచన! ★


జలుబు వల్ల ఓ మంచి రోజును పాడవనివ్వకండి



జలుబును పోగొట్టుకోవచ్చు

ముక్కు కారడం, ముక్కు దిబ్బడ, తలభారం, గొంతు నొప్పి, గుండెలో కఫం చేరడం లాంటివన్నీ మీ మంచి రోజుల్ని పాడు చేస్తాయి. అయితే, ఈ లక్షణాలుగల జలుబునుంచి ఉపశమనానికి ఓ మార్గం ఉంది.

జలుబు మందుతో వాటిని ఎదుర్కోండి

ఏ ఇతర జబ్బుకో చికిత్స చేసినట్లు జలుబుకి చికిత్సచేస్తే చాలదు. జలుబు లక్షణాలకు లోనైన అన్ని చోట్లా ఒకే మారుగా పనిచేసే ప్రత్యేకమైన మందే వాడండి

కోల్డరిన్ కేవలం జలుబు కోసమే

మిమ్మల్ని ఇబ్బంది పెట్టే అన్ని జలుబు లక్షణాలనుంచి ఉపశమనం కలిగిస్తుంది కోల్డరిన్. దీనిలోని ప్రత్యేకమైన ఔషధ పదార్థాలు జలుబు లక్షణాలుగల అన్నిచోట్లా కలిసికట్టుగా పనిచేస్తాయి. పైగా మీ శరీరంలో నిరోధక శక్తిని పెంచే విటమిన్ సి దీనిలో ఉంది. మీకు జలుబు చేస్తే, దానికి ప్రత్యేకమైన జలుబు మందే వేసుకోవడం ఉత్తమం.



కోల్డరిన్

జలుబు కోసం ప్రత్యేకంగా తయారుచేయబడింది

CASBC-64-232 TL